RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 341 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 జనవరి 2025 బుధవారం పేజీలు : 4

## కన్యాకుమారిలో అద్దాల వంతెన

చెన్నై : ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన తమిళనాడులోని కన్యాకుమారిలో రూ.37 కోట్లతో నిర్మించిన ఫైబర్ గ్లాస్ వంతెనను సీఎం ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. దీని పొడవు 77 మీటర్లు, వెడల్పు 10 మీటర్లు ఉంటుంది. వివేకానంద స్మారక మండపం, 133 అడుగుల ఎత్తయిన తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాలను కలిపేలా ఈ వంతెనను నిర్మించారు. కన్యాకుమారి తీరంలో వివేకానంద స్మారక మండపానికి 77 మీటర్ల దూరంలో 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ విగ్రహ ప్రతిష్టాపన జరిగి జనవరి 1వ తేదీకి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడు ప్రభుత్వం రెండు రోజులపాటు రజతోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఫైబర్ గ్లాస్ వంతెనను స్టాలిన్ ప్రారంభించారు.

# సర్వత్రా ఆసక్తి!

## ఎస్సీ వర్గీకరణ కమిషన్ రిపోర్ట్ కూడా...

### స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ప్రకటన, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు.. జాబ్ నోటిఫికేషన్లు అప్పుడే!!





హైదరాబాద్ : కొత్త ఏడాది మొదటి నెలలో రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటనలు చేయనున్నది. ముఖ్యమైన, సున్నితమైన అంశాలకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు ప్రకటిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ప్రధానంగా వచ్చే నెలలోనే కుల గణన సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వం రిలీజ్ చేయనున్నది. దాంతోపాటు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నది. అలాగే, ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన వన్ మ్యాన్ కమిషన్ కూడా వచ్చే నెలలోనే రిపోర్ట్‌ను ప్రభుత్వానికి సమర్పించనున్నది. దీని ప్రకారమే ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఈ రిపోర్ట్ వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకారం కొత్తగా నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు రెడీగా ఉన్నాయి.

వీటితోపాటు రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత లబ్ధిదారులను ఎంపిక చేసి.. ఇండ్లకు ముగ్గు పోయడం వంటి ముఖ్యమైన నిర్ణయాలన్నీ జనవరి నెలలో ఉండడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

**కుల గణన, ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్స్ సిద్ధం!** : కుల గణన సర్వేలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఇండ్ల నుంచి దాదాపు 97 శాతం మేర వివరాలు సేకరించినట్టు తెలిసింది. ఈ డేటా మొత్తం డిజిటలైజేషన్ చేశారు. ఇప్పుడు రిపోర్ట్ తయారు చేస్తున్నారు. అన్ని వివరాలు కాకుండా.. అవసరమైన వాటిని ప్రభుత్వం బయట పెట్టనున్నది. ఇక బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు కూడా ఎంత వరకు సమాచారం అవసరం పడుతుందో అంతే ఇవ్వనున్నారు.

ఆ తర్వాతే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రానున్నది. ఇదిలా ఉంటే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కూడా జనవరిలోనే రిపోర్ట్ ఇవ్వనున్నది. ఈ రిపోర్ట్ వచ్చిన తర్వాతే కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎస్సీ వర్గీకరణపై రిపోర్ట్ వచ్చాక.. కొత్త రోస్టర్‌తో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చేందుకు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. జనవరిలో ప్రక్రియ పూర్తయితే ఫిబ్రవరి నెల మొదటి వారంలోనైనా ఇచ్చే చాన్స్ ఉందని అంటున్నారు.

**ఇదే నెలలో మరో మూడు..** గత కొంత కాలంగా నానుతూ వస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటివి కూడా జనవరిలోనే మొదలు కానున్నాయి. రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి తర్వాత ఇవ్వనున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల వడపోత నడుస్తున్నది. అందులో నుంచి అర్హుల్లో మొదటి విడత లబ్ధిదారుల లిస్ట్ ను రిలీజ్ చేయనున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే మంచి రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. వీటితోపాటు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కూడా వచ్చే నెలలోనే మొదలుపెట్టనున్నారు. వీటన్నింటికి సంబంధించి త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిసింది.




# 'ఆసరా' పెంచేందుకు సిద్ధం

## తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కొత్త సంవత్సరం కానుక!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం కొత్త సంవత్సరాన్ని ఆనందంగా ప్రారంభించేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కొత్త హామీలు ఇచ్చింది. వాటిలో అత్యంత ముఖ్యమైనది ఆసరా పింఛన్ల పెంపు. ఇది ముఖ్యంగా వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు కోసం చేసిన పథకాలు. 2024 జనవరి లేదా ఫిబ్రవరి నాటికి ఈ పెంపు అమలుకు వస్తుంది. ఈ పెంపు ప్రజలు ఆశించినట్లుగా ఉంటే, వారు తమ ఖాతాల్లో డబుల్ పింఛన్లను పొందేందుకు సిద్ధంగా ఉండవచ్చు. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ఒక భాగంగా తీసుకుంది. ఈ గ్యారంటీ హామీలు ప్రజలకు మంచి అభిప్రాయాలను కలిగించాయి. ఇప్పటికే ఉచిత బస్సు సేవలు, సిలిండర్లపై తగ్గింపు, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి అనేక హామీలను అమలు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఆసరా పింఛన్ల పెంపును కూడా పూర్తి చేయాలని నిర్ణయించింది. 2014లో కేసీఆర్ ప్రభుత్వం ఈ పింఛన్లను మొదటగా పెంచినప్పటికీ, ఈ పెంపు ఇప్పుడు కాంగ్రెస్



హామీ ప్రకారం మరింత పెరుగుతుంది. రాష్ట్రంలో ఈ పెంపుపై పెద్దగా ఎదురు చూపులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం రైతు భరోసా మరియు రైతు రుణమాఫీ విషయంలో సర్కార్ అలసత్వం చూపించినప్పటికీ, ప్రజలను సంతృప్తిపరచడం ముఖ్యమని భావించి, ఇప్పుడు ఆసరా పింఛన్ల పెంపుతో ఆగస్టు నుండి మార్చి వరకు ఎన్నికల ప్రక్రియకు ముందే నిర్ణయం తీసుకుంది. ఇక, తెలంగాణలో ఈ ఆసరా పింఛన్లు ఒక పథకంగా 2014లో ప్రారంభించబడ్డాయి. ప్రారంభంలో వృద్ధులకు రూ.200 మాత్రమే ఉండేవి, ఇప్పుడు వాటిని అనేక సార్లు పెంచి రూ.4000 వరకు పెంచే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు వస్తోంది. 2018లో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పెంపు తర్వాత, ఈ ఆసరా పింఛన్ల బలం మరింత పెరిగింది. ఇప్పుడు ఈ పెంపుతో తెలంగాణ ప్రజలలో విశేషంగా ఆత్మస్థైర్యం కదలబోతుంది. ప్రజా అనుభవాలను అర్థం చేసుకొని, ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగినప్పుడు, రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే స్పందించింది. ఇక, సంక్రాంతి తరువాత రైతులకు మరింత హామీలు అందించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది.




# రేవంత్ సర్కార్ న్యూయర్ గిఫ్ట్..

# 'జనవరిలోనే అన్నీ'

హైదరాబాద్ : కొత్త ఏడాదిలో సరికొత్త నిర్ణయాలు, ప్రకటనలో ప్రజలకు అనేక శుభవార్తలు అందించనుంది తెలంగాణ ప్రభుత్వం. జనవరిలో అనేక నిర్ణయాలు తీసుకోనుంది తెలంగాణ ప్రభుత్వం. ఇందులో ప్రధానంగా కుల గణన సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వం రిలీజ్ చేయనున్నది. దాంతోపాటు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నది. అలాగే, ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన వన్ మ్యాన్ కమిషన్ కూడా వచ్చే నెలలోనే రిపోర్ట్‌ను ప్రభుత్వానికి సమర్పించనున్నది. కుల గణనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 97 శాతం మేర వివరాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ డేటా మొత్తం డిజిటలైజేషన్ చేశారు. ఇప్పుడు రిపోర్ట్ తయారు చేస్తున్నారు. అన్ని వివరాలు కాకుండా.. అవసరమైన వాటిని ప్రభుత్వం బయట పెట్టనున్నది. ఇక బీసీ డెడికేటెడ్ కమిషన్‌కుకు కూడా ఎంత వరకు సమాచారం అవసరం పడుతుందో అంతే ఇవ్వనున్నారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రానున్నది. ఇదిలా ఉంటే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఈ రిపోర్ట్ వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకారం కొత్తగా నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు రెడీగా ఉన్నాయి. జనవరిలో ప్రక్రియ పూర్తయితే ఫిబ్రవరి నెల మొదటి వారంలోనైనా ఇచ్చే చాన్స్ ఉందని అంటున్నారు. కొంత కాలంగా నానుతూ వస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటివి కూడా జనవరిలోనే మొదలు కానున్నాయి. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం సంక్రాంతి తర్వాత ఇవ్వనున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల వడపోత నడుస్తున్నది. అందులో నుంచి అర్హుల్లో మొదటి విడత లబ్ధిదారుల లిస్ట్ ను రిలీజ్ చేయనున్నారు. పండగ తర్వాత వచ్చే మంచి రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. వీటితోపాటు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కూడా వచ్చే నెలలోనే మొదలుపెట్టనున్నారు. వీటన్నింటికి సంబంధించి త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిసింది.

# సంపాదకీయం

## మన్మోహన్ సింగ్ కి భారతరత్న... బీజేపీ ఏం చేయబోతోంది ?

ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎంతటి మేధావి ఎంతటి గొప్పవారు అన్నది అందరికీ తెలిసిందే. అది ఆయన మరణానంతరం బయటకు రావడం ఇంకా విశేషం. ఆయన జీవించి ఉన్న రోజులలో కంటే మరణించాకనే వేయి నోళ్ల పొగిడించుకున్నారు. ఇంతటి ఆర్థిక నిపుణుడు లేడు అనిపించుకున్నారు. అంతే కాదు ఈ రోజు భారత దేశం తాను ప్రపంచంలో అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటోంది అంటే పునాదులు వేసి పరిపుష్టం చేసిన ఘనత మన్మోహన్ సింగ్ దే అని తేటతెల్లమైన తరువాత ఆయన కీర్తి మరింతగా విస్తరిస్తోంది. దాంతో పాటుగా ఆయనకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్ కూడా ఉంది. ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం ప్రకటించాలీ అంటే అది బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పెద్దల చేతులలో ఉంది. కేంద్రం తలచుకుంటే అది సుసాధ్యమే అవుతుంది. పైగా దేశమంతా దానిని ఆమోదిస్తారు. అందువల్ల ఈ విషయం మీద బీజేపీ పెద్దలు సీరియస్ గానే ఆలోచించవచ్చు అని అంటున్నారు. ప్రతీ ఏటా జనవరి 26న పద్మ పురస్కారాల గ్రహీతల జాబితాను విడుదల చేస్తారు. దానితో పాటుగానే భారత రత్న ఎవరికి ఇస్తారో వారి పేర్లు కూడా విడుదల చేస్తారు. అలా చూసుకుంటే అతి తక్కువ రోజులలోనే ఈ అవార్డు ఎవరికి దక్కుతుందో తెలుస్తుంది. గత సారి రెండు మూడు విడతలుగా కొందరు ప్రముఖులకు భారత రత్న అవార్డుని కేంద్రం ప్రకటించింది. ఈసారి కొత్త ఏడాదికి కొద్ది రోజుల ముందే కన్ను మూసిన మన్మోహన్ సింగ్ పేరుని భారత రత్న అవార్డుల జాబితాలో చేర్చవచ్చు అని అంటున్నారు మన్మోహన్ సింగ్ కి బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది. ఆయన స్మారక చిహ్నం కోసం భూమిని కేటాయించాలని ఆలోచన చేస్తోంది. దాంతో ఇపుడు భారత రత్న కూడా ఇచ్చేందుకు వీలు ఉంటుందేమో అని అంతా ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఆయన గాంధీ కుటుంబీకుడు కాదు, కాంగ్రెస్ పార్టీకి రెండు దఫాలు ప్రధానిగా చేసిన ఒక సాధారణ నాయకుడు. పైగా ఆయన ఆర్థిక విధానాలు సర్వజనామోదం పొందాయి. దాంతో ఆయనకు భారత రత్న ప్రకటించడం ద్వారా బీజేపీ ఆయన అభిమానులను కూడా సంతోషపెట్టేందుకు యత్నించవచ్చు అని అంటున్నారు. అలా కాంగ్రెస్ చేయలేని పనులను తాము చేశామని మహనీయులను పెద్దలను గౌరవించడంలో తరతమ భేదాలు చూపించ లేదని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ మీద పై చేయి సాధించవచ్చు అని అంటున్నారు. గతంలో ప్రణబ్ ముఖర్జీకి కూడా భారర రత్న అవార్డుని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందువల్ల మన్మోహన్ సింగ్ కి ఆ అత్యున్నత గౌరవం దక్కవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కాలువ స్థలాల కబ్జా



గంగాధర: పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదిలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు.

**తేల్చని హద్దులతో ఆక్రమణలు**

గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటి శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది.

**సర్వే చేసి తొలగిస్తాం**

నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం.
వజహత్ అలీ, ఏఈ

# కాటమయ్య కిట్టు .. ప్రాణాలకు భరోసా



సిరిసిల్ల : కల్లు గీత కార్మికులు తాటి, ఈత చెట్టు ఎక్కే సమయంలో ప్రమాదం జరుగుతుండటంతో తీవ్ర గాయాల పాలవుతున్నారు. కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక నుంచి ఏ ఒక్క గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి ప్రాణాలు కోల్పోకుండా చూడాలని భావించింది. ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేయించి పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లా బీసీ సంక్షేమ శాఖ, ఆబ్కారీ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 400 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే వాటిపై శిక్షణ కూడా ఇచ్చారు. తాటి, ఈత చెట్లు ఎక్కేటప్పుడు వీటిని ధరించడం వల్ల ప్రమాదం జరగకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఆరు రకాల వస్తువులు**

కల్లుగీత కార్మికులకు అందించే కాటమయ్య రక్షణ కవచం కిట్టులో ఆరు రకాల వస్తువులు ఉన్నాయి. తాడు, క్లిప్పులు, హ్యాండిల్, స్లింగ్ బ్యాగ్, లెగ్‌లూప్ వంటివి ఉన్నాయి.

తాటి చెట్టు ఎక్కే సమయంలో నడుముకు ముత్తాదు, చెట్టు ఎక్కడానికి ఉపయోగించే మోకుతో పాటు రెండు కాళ్లకు గుయి ధరించి ఎక్కుతారు. ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు మోకు జారినా, లేక రెండు కాళ్లకు ఉన్న గుయి పడిపోయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నుంచి రక్షించడానికి ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేశారు.

కిట్టులోని పరికరాలను నడుముకు బిగించుకొని తాడుతో మోకుకు అనుసంధానం చేసి చెట్టు ఎక్కాలి. ప్రమాదవశాత్తు మోకు జారిపోయినా, గుయి కింద పడినా జారి పడకుండా కిట్టుకు ఉన్న తాడు చెట్టుకు బిగుసుకుపోతుంది. దీంతో చెట్టుపై నుంచి పడకుండా అక్కడే ఉండి పోతారు. అనంతరం వారు కాలికి ధరించిన లెగ్‌లూప్ సహాయంతో చెట్టును సులభంగా దిగ గలుగుతారు.


ఈ కిట్టు 2,200 కిలోల బరువును ఆపుతుంది.

**సద్వినియోగం చేసుకోవాలి:** రాజమనోహర్‌రావు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి గీత కార్మికులకు అందించిన కాటమయ్య రక్షణ కవచం కిట్లను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ఈ కిట్టు వినియోగంపై గీత కార్మికులకు శిక్షణ అందించాం. దీనిని ధరించి ప్రమాదం జరగకుండా చూసుకోవాలి.

# 'ప్రశస్త్'తో దివ్యాంగ లక్షణాల గుర్తింపు

ఇబ్రహీంపట్నం: పిల్లల్లో దివ్యాంగ లక్షణాలు ఉంటే సరైన సమయంలో గుర్తించి, చికిత్స అందించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి సంకల్పించింది. బాల్యంలోనే దివ్యాంగ లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించక పోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్యలు తీవ్రమవుతాయి. దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మెరుగైన జీవనం గడపగలరు. చిన్నారుల్లో దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో ప్రశస్త్ ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి లోపు పిల్లల్లో మూడు దశల్లో దివ్యాంగ లక్షణాల నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారు. ఈ క్రమంలో చిన్నారుల నడకలో తేడా, లేదంటే నడవడానికి ఇతరుల సహాయం తీసుకోవడం, శరీరంలోని భాగాల కదలికలో తేడా, మెడ, చేతులు, వేళ్లు, మణికట్టు, కాళ్లు వంటి 21 రకాల దివ్యాంగ లక్షణాలను ఉపాధ్యాయులు గుర్తించే అవకాశం అధికంగా ఉంటుంది. దివ్యాంగ లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిని ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చరవాణుల్లో మెయిల్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.


విద్యార్థుల్లో దివ్యాంగ లక్షణాల గుర్తింపు ప్రక్రియ మూడు దశల్లో జరగనుంది. మొదటిదశలో ఉపాధ్యాయుడు రెండు వారాలపాటు




గమనించి వివరాలను 26లోగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో గుర్తించిన విద్యార్థులను శిక్షణ పొందిన నిపుణులు గమనించి మరోమారు యాప్‌లో నమోదు చేస్తారు. చివరి దశలో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించి, బాల్యంలోనే మెరుగైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారి అనుమతి మేరకు పరీక్షలకు పంపించనున్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు లేనందున ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అయ్యప్ప మాల ధారణ భక్తులకు, ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# బడ్జెట్‌లో ఘనం.. ఇచ్చింది తృణం

రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,200 కోట్లు కేటాయించినా.. ఆ నిధులను విడుదల చేసేందుకు ఆర్థికశాఖ ముందుకురావడం లేదు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో ఇప్పటివరకు కేవలం పదోవంతు మాత్రమే విడుదలయ్యాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో జీహెచ్ఎంసీలో అభివృద్ధి ఎక్కడకక్కడే ఆగిపోయింది. పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం ఉద్యోగుల జీతాలు, వివిధ రకాల నిర్వహణ పనులకే సరిపోతుండడంతో..రోడ్లు, నాలాలు ఇతరత్రా పనులు చేపట్టడానికి వీలుపడటం లేదు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అత్యవసరంగా రూ.వెయ్యి కోట్ల నిధులను ఆర్థిక శాఖ విడుదల చేయాలని బల్దియా అధికారులు కోరుతున్నారు.

**పనులు నిలిపేసిన గుత్తేదారులు..**

గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో బల్దియాలోని అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్దఎత్తున బకాయి పడింది. రూ.1500 కోట్లు రోడ్ల నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులకే ఇవ్వాల్సి ఉంది. బకాయిలు ఇవ్వకపోవడంతో ఏడాదిగా పనులు నిలిపివేశారు. వివిధ పనులకు పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు రూ.2500 కోట్లు రెండు పడక గదుల ఇళ్ల గుత్తేదారులకు ఇవ్వాల్సి ఉంది. దీంతో 35 వేల ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఈ ఇళ్లను మూసీ నిర్వాసితులకు కేటాయించాలని అనుకున్నారు. అసంపూర్తిగా ఉండడంతో కేటాయించలేని పరిస్థితి. నిర్వాసితుల కోసం రెండు పడక గదుల ఇళ్లను సిద్ధం చేయడానికి రూ.1000 కోట్లు కేటాయించాలని పురపాలక శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

**ఏ మూలకూ చాలక..**

బల్దియాలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ చొరవ తీసుకుని హెచ్ఎండీఏతోపాటు ఇతర విభాగాల్లో ఉన్న నిధుల్లో దశల వారీగా రూ.300 కోట్లు విడుదల చేయించారు. ఈ మొత్తం నిధులు దేనికీ సరిపోవడం లేదని గ్రేటర్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఎస్సార్డీపీ కింద చేపట్టిన వంతెనల పనులను గుత్తేదారులు ఆపేశారు. కాలనీ రోడ్ల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ విడుదల చేసిన రూ.150 కోట్ల నిధుల్లో ఒక్కో జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున ఆరు జోన్లకు రూ.120 కోట్లు కేటాయించారు. కానీ ఆ నిధులతో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించ లేని పరిస్థితి. ఒక్కో జోన్‌కు రూ.300 కోట్లను విడుదల చేస్తే అన్ని పనులు మొదలుపెట్టడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# యాసంగి కార్యాచరణ ఖరారు

మెదక్: వానాకాలం సీజన్ ముగిసింది. దిగుబడులు చేతికి వస్తున్నాయి. ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురవడంతో నీటి వనరులు నిండుగా ఉన్నాయి. సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు పెరిగాయి. సెప్టెంబర్ నాటికి జిల్లాలో భూగర్భజలాలు సరాసరి 10.81 మీటర్ల పైకి చేరడంతో యాసంగి సాగుపై భరోసా కలిగింది. గతేడాది పోలిస్తే ఈసారి విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. దీనికి అనుగుణంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. గతేడాది కంటే ఈసారి వరి నాలుగు వేల ఎకరాలు అదనంగా సాగు కావొచ్చని అంచనా వేశారు. దొడ్డురకం పంటను ఎక్కువ సాగు చేసే అవకాశం ఉంది.

**సమృద్ధిగా నీరు...**

రబీ సీజన్‌లో పంటల సాగుకు ఢోకా లేదు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిల్లాలో అడపాదడపా వర్షాలు కురిసి వానాకాలం ముగిసినా గత కొద్దిరోజుల నుంచి వానలు పడుతున్నాయి. దీంతో జిల్లాలోని ఏకైక మధ్యతర ప్రాజెక్టు ఘనపూర్, చిన్ననీటి తరహా ప్రాజెక్టు హల్దీలోకి పెద్దఎత్తున నీళ్లు వచ్చిచేరాయి. ఇటీవల వర్షాలకు ఈ రెండు ప్రాజెక్టులు పొంగుతున్నాయి. ఇక జిల్లాలో చెరువులు, కుంటలు సైతం పొంగిపొర్లడంతో సాగుకు కలిసొచ్చే అవకాశం ఉంది.

**విత్తనాల కొరత లేకుండా..**

పంటల సాగుకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. గతేడాది యాసంగిలో 48,183 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగం కాగా, వచ్చే సీజన్‌కు 48,491 టన్నులు అవసరమవుతాయని ప్రణాళిక రూపొందించారు. సొసైటీలు, ఆగ్రోస్, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేలా దృష్టి పెట్టనున్నారు.

# వీధికి వదిలేశారు

హైదరాబాద్ : సాక్షాత్తు.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలోని పలు రహదారుల్లో వీధిలైట్లు లేకపోవడంతో నెలక్రితం 100కుపైగా స్తంభాలను ఏర్పాటు చేయగా.. ఇప్పటి వరకు వాటికి లైట్లను అమర్చలేదు. ఎప్పుడు బిగిస్తారని ఇంజినీర్లను అడిగితే.. నేడో.. రేపో అంటూ జీహెచ్ఎంసీ కాలక్షేపం చేస్తోంది. ఇక సామాన్యుల ఫిర్యాదుల గురించి వేరే చెప్పనక్కర్లేదు. వేలాది ఫిర్యాదులు నెల రోజులుగా పరిష్కారానికి నోచుకోవట్లేదు. కొత్త స్తంభాలకు లైట్లను అమర్చే గుత్తేదారులు, పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని అమర్చే కాంట్రాక్టర్లు నెల రోజులుగా ధర్నాలో ఉండటమే కారణం.



**గుత్తేదారుల సమస్య ఏంటంటే..**

నగరంలో ఎల్ఈడీ లైట్లను అమర్చి, వాటిని రోజూ 98శాతం వెలిగిస్తామంటూ ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ ఏడేళ్ల కాలానికి జీహెచ్ఎంసీతో ఒప్పందం చేసుకుంది. సదరు సంస్థ కాంట్రాక్టు గడువు ఏప్రిల్, 2025తో ముగియనుంది. నిబంధనలు ఉల్లంఘించడంతో కొన్ని నెలలుగా ఆ సంస్థకు బిల్లుల చెల్లింపు నిలిపినట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. మరోవైపు ఈఈఎస్ఎల్ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంది. దాంతో.. సర్కిళ్ల వారీగా లైట్ల నిర్వహణ చూసే గుత్తేదారులకూ చెల్లింపులు నిలిచాయి. వారు నెల రోజులుగా ధర్నా చేస్తున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ రూ.150కోట్ల మేర చెల్లించాల్సి ఉందని ఈఈఎస్ఎల్ చెబుతోంది. మరోవైపు సదరు సంస్థతో ఒప్పందాన్ని పొడిగించుకునే అవకాశాలను జీహెచ్ఎంసీ అటకెక్కించడంతో సమస్య తీవ్రంగా మారింది.

**నిత్యం వెయ్యి ఫిర్యాదులు**

నగరంలో 5.48లక్షల ఎల్ఈడీ వీధిలైట్లు ఉన్నాయి. నిర్మానుష్య ప్రాంతాల్లో మరో పది వేల లైట్లు అవసరం. రోజూ వీధిలైట్లు వెలగట్లేదంటూ సగటున వెయ్యి ఫిర్యాదులు వస్తుంటాయి. నెల రోజులుగా ఆయా సమస్యల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదు. కొత్త బల్బులు ఏర్పాటు చేసేందుకు సిబ్బంది లేరని అధికారులు ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండటం ఆందోళనకు అద్దం పడుతోంది.

# పొగబండ్లపై కొరడా

హైదరాబాద్ : మహానగరంలో కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలకు చెక్ పెట్టాలని రవాణా, పోలీసు శాఖలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటి వరకు ట్రాఫిక్ ఉల్లంఘనలపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారు. కేవలం పెండింగులో ఉన్న చలానాల కోసమే పోలీసులు వాహన తనిఖీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆ శాఖలో పోస్టులను భర్తీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసు, రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీల్లో పెండింగు బకాయిలే కాకుండా బీమా, కాలుష్య స్థాయులను నిర్ధారించే ధ్రువపత్రాల పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ట్రాఫిక్ చలానాల వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పోలీసు శాఖ ఇటీవల అమలు చేసింది. ఇక కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై దృష్టి సారించాలని



నిర్ణయించారు.

**కాలుష్య తనిఖీ పత్రాలు అనివార్యం..**

రవాణా శాఖ నిబంధనల మేరకు వాహనాలను ఆరు నెలలకోసారి కాలుష్య తనిఖీలు చేయించాలి. వాటి ధ్రువపత్రాలను వాహనాల్లో అందుబాటులో ఉంచుకోవాలి.తనిఖీ సందర్భంగా వాహనం కాలుష్య స్థాయులు రవాణా శాఖ సర్వర్‌తోపాటు ఆర్టీఏ ఎం వ్యాలెట్‌లోనూ నమోదు అవుతాయి. తనిఖీ సమయంలో ఆర్టీఏ ఎం వ్యాలెట్లోని కాలుష్య ధ్రువపత్రాన్ని చూపినా సరిపోతుంది. వాహనాల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో వాటి విషయంలో దృష్టి సారించిన దాఖలాలు లేవు. ప్రమాదాలకు గురైన సందర్భాల్లోనే తనిఖీ చేస్తున్నారు. భవిష్యత్తులో అన్ని ధ్రువపత్రాలను పరిశీలించాలని నిర్ణయించారు. త్వరలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తరువాత ఆ ప్రక్రియను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ఓ అధికారి వివరించారు.

# అత్యున్నత ప్రమాణాలతో మురుగు శుద్ధి

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మురుగునీటి శుద్ధిలో అత్యున్నత ప్రమాణాల నిర్వహణ నేపథ్యంలో పకడ్బందీ పర్యవేక్షణ విధానానికి జలమండలి శ్రీకారం చుడుతోంది. హైదరాబాద్, చుట్టుపక్కల ఇప్పటి వరకు 36 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) అందుబాటులోకి రాగా మరో 9 ఎస్టీపీల పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్టీపీలో మురుగునీటి శుద్ధి ప్రమాణాల మేరకు ఉండేలా జలమండలి ఆన్‌లైన్ కంటిన్యూ ఎఫులియెంట్ మోనటరింగ్ సిస్టమ్ (ఓసీఈఎంఎస్)ను అమలు చేయనుంది. ఎస్టీపీలో జలమండలి కొన్నింటిని నిర్వహిస్తుండగా మరికొన్నింటిని హైబ్రీడ్ యాన్యూటీ విధానంలో ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నాయి. తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకునే ప్రమాణాల మేరకు శుద్ధి చేసిన జలాలు ఉండాలి. ప్రధాన కార్యాలయం నుంచి ప్రతి ఎస్టీపీని పర్యవేక్షించనున్నారు. ఎంత మురుగునీరు ఎస్టీపీలో వస్తోంది? ఎంత శుద్ధి అవుతోంది? నాణ్యత ఎలా ఉంది? అనేది 24 గంటలు పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. **సీపీసీబీ నిర్దేశించినట్లు ఉండాలని..**మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఎస్టీపీల్లో శుద్ధి అయ్యే మురుగునీరు కూడా నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఉండాలనేది జలమండలి లక్ష్యం. శుద్ధి కేంద్రాల్లో బీఓడీ, సీఓడీ, పీహెచ్‌ఏలు కేంద్ర కాలుష్య నియంత్రణ (సీపీసీబీ) మండలి నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఉండాలి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు భౌతికంగా తనిఖీలు చేసి శుద్ధి అయిన మురుగునీటి ప్రమాణాలను గుర్తించడం అన్ని వేళలా సాధ్యం కాని పరిస్థితుల నేపథ్యంలో కొత్త పర్యవేక్షణ విధానం మెరుగైన ఫలితాలు ఇస్తుందని వివరించారు.

# నేవీ ప్రాజెక్టు.. వడివడిగా ముందుకు



పూడూరు : దాదాపు పదిహేనేళ్ల ప్రతిపాదన.. మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. న్యాయస్థానంలో కేసులు. ప్రజా ఉద్యమాలు.. ఇలా అనేక ఒడిదుడుకులను అధిగమించి జిల్లాకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.. పూడూరు మండలం, దామగుండం నేవీ ప్రాజెక్టు. గత అక్టోబరులో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాప జరిగింది. ఇక్కడ ఏర్పాటయ్యే టవర్లతో సముద్రంలో నడిచే జలాంతర్గాములు, ఓడలకు సంకేతాలు అందుతాయి. దేశంలోనే ఇది రెండో ప్రాజెక్టు. 2027 నాటికి పూర్తి చేయాలనేది కేంద్ర లక్ష్యం. ఇందుకు అనుగుణంగా పలు నిర్మాణాలు వడివడిగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**అనువైన ప్రదేశం కావడంతో ఎంపిక**

దామగుండం అటవీ ప్రాంతం ఎత్తయిన ప్రదేశంలో ఉందని భావించిన నేవీ అధికారులు ప్రాజెక్టు ఏర్పాటుకు 2009లో ఆసక్తి చూపారు. వివిధ అనుమతులు పొందిన అనంతరం ఇటీవల ప్రభుత్వం 2,900 ఎకరాలను అప్పగించింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది నివాస గృహాలు, కార్యాలయం, పాఠశాల, ఆసుపత్రి, మార్కెట్, టవర్ల ఏర్పాటు, పార్కులు, రహదారులు వంటివి ఎక్కడ చేపట్టాలని ఇంజినీర్ల బృందంతో పరిశీలించి నమూనా (మ్యాప్) తయారు చేశారు. దాని ప్రకారం అయ్యే వ్యయం కేంద్రం భరిస్తుంది. ముందుగా రూ.2,500 కోట్లను మంజూరు చేసింది.

**మరోచోట నాటిస్తున్నాం**

దామగుండం అడవిలో నిర్మాణాలు జరిగే ప్రదేశంలో చెట్లను తొలగించాల్సి రావటంతో మరోచోట నాటిస్తున్నాం. ఎక్కడ చెట్లు కొట్టేయాలన్నా ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆలయానికి వచ్చిపోయే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అరుణ, అటవీశాఖ పర్యవేక్షకురాలు, వికారాబాద్.

**ఆలయమూ వారి పరిధిలోకే..**

అడవిలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రాజెక్టు దేశభద్రతకు సంబంధించింది కావటంతో ఆలయం ఇక నేవీ ఆధీనంలో ఉంటుంది. ఆలయానికి వచ్చిన భక్తులు నేవీ వారు ఏర్పాటుచేసే గేటు నుంచి ప్రవేశం పొంది తిరిగి రావటం తప్ప ఎటూ వెళ్లలేని విధంగా ఉంటుంది.

చురుకుగా పనులు: దామగుండంలో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వైజాగ్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. దీంతో ఇప్పటికే అడవి చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం కందకాలు తీస్తున్నారు. భారీ టవర్లు ఏర్పాటు చేయనున్న తిర్మలాపూర్ ప్రాంతంలో చెట్లను తొలగిస్తున్నారు.

# కర్రసాముతో ధైర్య సాహసం



సిరిసిల్ల : కర్రసాము ఒక విలక్షణ ఆత్మరక్షణ విద్య. దీనిని నేర్చుకోవడం ద్వారా ఎంతటి సవాళ్లను అయినా అధిగమించే సామర్థ్యం వస్తుంది. పురాతన విద్య నేడు అధునాతన హంగులతో ముందుకు వచ్చింది. నేటి కాలంలో సవాళ్లను అధిగమించే సామర్థ్యాన్ని మహిళల్లో కల్పించేందుకు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా శిక్షణ అందిస్తోంది. దీంతో చిన్నారులు మొదలుకొని మహిళల వరకు నేర్చుకుని ఊహించని పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోగలమన్న ధైర్యాన్ని పొందుతున్నారు.

**ధైర్యం కోసం...**కోడం లహరి, గృహిణి

గతంలో నేను బయటకు రావడానికే భయంగా అనిపించేది. కర్రసాము శిక్షణ పొందిన తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎవరూ తోడు లేకుండానే షాపింగ్‌కు వెళ్తున్నాను. మార్కెట్‌కు వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకొస్తున్నాను. శిక్షణ నాకు ఎంతో ధైర్యాన్ని నింపింది.

**మహిళలందరూ నేర్చుకోవాలి**దాసరి తిరుమల, న్యాయవాది

సిరిసిల్ల పట్టణంలోని మహిళలందరూ కర్రసాము నేర్చుకోవాలి. రక్షణ చట్టాలు కఠినంగా మారినా నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతున్నాయి. ప్రతి మహిళా కర్లసాము శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ధైర్యంగా ఉండాలి.

**విద్యార్థి దశలోనే నేర్పించాలి**కనుకుంట్ల సంజన, జూనియర్ డాక్టర్

సమాజంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయి. అఘాయిత్యాల నుంచి రక్షించుకునేందుకు కర్రసాము శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా పాఠశాల నుంచి మొదలుకొని యువతులు, మహిళల వరకు నిత్యం ఏదో ఓ ప్రాంతంలో దాడులు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి రక్షణ పొందడానికి విద్యార్థి దశలోనే కర్రసాము నేర్పించాలి. బాలికలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది**అలువాల ఈశ్వర్, హెల్పింగ్ హార్ట్స్, అధ్యక్షుడు

పురాతన విద్య నేడు అధునాతన హంగులతో ముందుకు వచ్చింది. నేటి ఆధునిక కాలంలోని సవాళ్లను అధిగమించే సామర్థ్యాన్ని పొందవచ్చు. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు 200 మంది చిన్నారులు, యువతులు, మహిళలు నేర్చుకున్నారు.

**కాలనీ పిల్లలకు నేర్పుతున్నా...**సాదల తేజప్రియ, డిగ్రీ విద్యార్థిని

ఆడపిల్లలకు రోజు రోజుకు రక్షణ లేకుండా పోతుంది. ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతున్నాయి. ఎవరికి వారే తమ రక్షణను చూసుకోవాలి. చట్టాలు, పోలీసు వ్యవస్థ స్పందన కోసం చూస్తే నష్టపోయేది మనమే అన్న ఉద్దేశంతో స్వీయ రక్షణకు కర్రసాము నేర్చుకున్నాను. ఇంటి వద్ద కాలనీ పిల్లలకు కూడా నేర్పిస్తున్నాను.

**మంచి విద్య** కౌసల్య, బ్యూటీషియన్

నన్ను నేను రక్షించుకోవడమే కాదు ఇతరులకు కూడా కర్రసాము శిక్షణ నేర్పాలనే లక్ష్యంతో నేర్చుకున్నాను. ఇది పురాతన విద్య అయినా మంచిది. నేర్చుకోవడంతో నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# హైలెవల్ వంతెన నిర్మాణమెప్పుడో?



వేములవాడ : అధికారులు బదిలీ అవుతున్నారు. ప్రజాప్రతినిధులు మారుతున్నారు. అయినా పైవంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. నిధులున్నా నిర్లక్ష్యం వీడటం లేదు. భూమిపూజ చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం మొదలు కాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మరోవైపు ఏటా భారీ వర్షాలకు కాలువ పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయి ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టు కాలువపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రెండున్నరేళ్ల క్రితం రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేసినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు ఆగిపోయాయి. పైవంతెన నిర్మాణానికి భూమిపూజ చేయడంతో ఏటా పడే కష్టాలు తీరుతాయని ఈ ప్రాంతీయులు సంబరపడ్డారు. వంతెన నిర్మాణం కాకపోవడంతో దాదాపు అయిదు గ్రామాల ప్రజలతోపాటు వేములవాడ నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు రవాణా సౌకర్యం ప్రతి వర్షాకాలంలో నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డులో పైవంతెన నిర్మాణంలో జాప్యం పట్ల స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది.

**ఎక్కడి వారు అక్కడే...**మల్లారం రోడ్డులోని కట్టు కాలువలోకి వర్షం నీటితో పాటు పంట పొలాల నుంచి వచ్చే వరద చేరుతుంది. దీంతో ఈ కాలువ వర్షాకాలంలో భారీ ఎత్తున పారుతుంది. వాగుకు ఇరువైపులా వాహనదారులు ఎక్కడి వారు అక్కడే నిలిచిపోవాల్సి వస్తుంది. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఏటా వర్షాకాలంలో కల్వర్టు వద్ద పైపుల నుంచి వెళ్లే నీరు కాకుండా భారీగా వరద పైనుంచి పారడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. భారీ వర్షం కురిస్తే భీమేశ్వర కాలువ నీటితో పాటు వ్యవసాయ పంట పొలాల నుంచి భారీగా వరద ఈ కాలువలోకి చేరుతుంది. దీంతో రవాణా స్తంభించిపోయి ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైవంతెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. **తిరిగి టెండర్ల నిర్వహణకు ఆదేశాలు**

వేములవాడ శివారు మల్లారం రోడ్డులోని కాలువపై హైలెవల్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయినప్పటికీ గుత్తేదారు పనులు చేపట్టడం లేదు. దీంతో ఆ టెండర్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించి పనులు చేపట్టేందుకు ఇప్పటికే ఆర్అండ్ బీ అధికారులకు ఆదేశాలివ్వడం జరిగింది. త్వరలోనే వంతెన నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం.ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేములవాడ

# ముందుకు సాగని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల పనులు

శంషాబాద్ : ఔటర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి సర్వీస్ రహదారుల నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు. ఈ పనులు పూర్తి చేసే బాధ్యత తమది కాదని హెచ్ఎండీఏ అధికారులు చేతులెత్తేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి ఔటర్ కూడలికి అనుసంధానంగా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. మొదటి దశలో 2006లో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండుపల్లి శివారు వరకు 21 కి.మీ. మార్గాన్ని చేపట్టారు. తొండుపల్లి కూడలికి అనుసంధానంగా నిర్మించాల్సిన సర్వీస్ రహదారుల పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.



**వెనుదిరుగుతున్న వాహనాలు..**

గచ్చిబౌలి నుంచి సర్వీస్ రోడ్ల మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తున్న వాహనదారులు తొండుపల్లి కూడలి వద్దకు రాగానే రోడ్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వరంగల్, విజయవాడ వైపు నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి సర్వీస్ రోడ్ల మీదుగా వస్తున్న వాహనాలు హమీదుల్లానగర్ వద్ద రోడ్లు కనిపించక పోవడంతో వెనుదిరగాల్సి వస్తోంది. రాత్రి సమయంలో ఈ రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవుటర్ రింగ్ రోడ్డును వ్యవసాయ పంట పొలాల మీదుగా నిర్మించడంతో శివారు గ్రామాల అనుబంధ రహదారులు తెగిపోయాయి. స్థానికులకు మెరుగైన రవాణా సదుపాయం ఉండేలా అవుటర్‌కు ఇరువైపులా విశాలమైన సర్వీస్ రోడ్లను నిర్మించారు. శంషాబాద్‌లో సర్వీస్ రహదారుల నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు.హమీదుల్లా నగర్, పోశెట్టిగూడ గ్రామస్థులు 3-4 కి.మీ. దూరంలో ఉన్న శంషాబాద్‌కు వచ్చేందుకు తొండుపల్లి మీదుగా 6 కి.మీ.ప్రయాణించాల్సి వస్తోంది. మొదటి దశలో చేపట్టిన తొండుపల్లి, పోశెట్టిగూడ ప్రాంతాల్లో ఆగిపోయిన ఒకటిన్నర కి.మీ. మార్గంలో సర్వీస్ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఊపందుకోని యాసంగి సాగు

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో అక్టోబరు 1 నుంచి యాసంగి సీజను మొదలైనా ఇప్పటి వరకు పైర్లసాగు నెమ్మదిగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. కరీంనగర్ జిల్లాలో అన్ని పంటల సాగు విస్తీర్ణం 18 శాతం, పెద్దపల్లి 16, జగిత్యాల 31, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26 శాతంగానే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలను ఇవ్వకపోవటంతో రైతులు వరివైపే మొగ్గుతున్నారు. ఇప్పటికే వరినార్లు పోసిన రైతులు నాట్లను ప్రారంభించారు. దొడ్డుగింజ రకాలను అధిక విస్తీర్ణంలో నార్లు పోయగా ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్‌ను ఇస్తామనటంతో యాసంగిలోనూ కొందరు రైతులు సన్నగింజ వరిరకాలను సాగుచేస్తున్నారు.



మరికొందరు రైతులు వరిలో సంకర, సూటిరకాల్లో విత్తనోత్పత్తి చేపట్టారు. ఆరుతడి పంటలుగా మక్క, ఆవాలు, పెసర, మినుము, వేరుసెనగ, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, సెనగ వంటి పంటలను విత్తుకోగా జనవరిలో నువ్వులు, కూరగాయలు, పెసర, మినుము తదితర పంటల సాగుకు అదనుంది. మరోవైపు భూగర్భ జలలభ్యతతో పాటుగా ఈ నెల 25 తేదీ నుంచి.. జనవరి 2వ తేదీ నుంచి జోన్ల వారీగా ఆయకట్టుకు నీటితడుల ప్రణాళికను అమలు చేయనుండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది.

# ఆధ్యాత్మిక పర్యాటకం

వేములవాడ : కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో పర్యాటక స్ఫూర్తి పరిఢవిల్లుతోంది.. ఆధ్యాత్మిక క్షేత్రాలకు రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకుల తాకిడి పెరుగుతోంది.. ప్రజా రవాణా వ్యవస్థతోపాటు వ్యక్తిగత రవాణా వాహనాల సౌకర్యం పెరగడంతో పర్యాటకులు పెరుగుతున్నారు.. శ్రావణ మాసంతోపాటు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం పర్యాటకులు పెరగడానికి కారణమని తెలుస్తోంది.. పర్యాటక శాఖ తాజాగా వెల్లడించిన లెక్కల ప్రకారం ఎక్కువ మంది పర్యాటకులు వచ్చినరాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో, జగిత్యాల అయిదో స్థానంలో నిలిచాయి..

**ప్రత్యేకత ఇలా..**

ఈ ఏడాది 8 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాలకు 6.51 కోట్ల మంది వెళ్లగా.. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చినవారే 1.27 కోట్ల వరకున్నారు. మొత్తం పర్యాటకుల్లో మన వద్దకు వచ్చిన వారే దాదాపు 20 శాతం.వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం ఉండటం రాజన్న సిరిసిల్ల జిల్లాకు.. కొండగట్టు, ధర్మపురి దేవస్థానాలుండటం జగిత్యాల జిల్లాకు పర్యాటకులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

వచ్చిన పర్యాటకుల్లో 62 శాతం మహిళలున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వీరికి కలిసొచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఉమ్మడి జిల్లాకు వచ్చిన పర్యాటకుల సంఖ్య దాదాపుగా మూడింతలకు చేరువైంది. **కోటిన్నర మందికిపైగా...**ఇప్పటికే ఈ ఏడాదిలో కోటిన్నరకుపైగా సందర్శకులు ఉమ్మడి జిల్లాకు విచ్చేశారు. 2024 సంవత్సరంలో ఆగస్టు వరకు ఉమ్మడి జిల్లాకు ఏకంగా 1,64,53,235 మంది వచ్చారు. ఈ ఏడాది నెలకు సగటున 20 లక్షలకుపైగా వస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో మరో 80 లక్షల మంది నాలుగు జిల్లాలకు వచ్చే వీలుంది. దీన్ని బట్టి ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో దాదాపుగా రెండున్నర కోట్ల మంది ఇక్కడి ప్రదేశాలను వీక్షించేందుకు వచ్చినట్లవుతుంది. గతేడాది జనవరి నుంచి ఆగస్టు వరకు వచ్చిన వారు 65.76 లక్షలు ఉండగా ఈ సారి అదే ఎనిమిది నెలల వ్యవధిలో 1.64 కోట్ల మంది ఉమ్మడి జిల్లాకు రావడం విశేషం.



# పేద కుటుంబాల లోగిళ్లకు చంద్రబాబు: తక్షణ ఆదేశాలు

అమరావతి : రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం.. పండగ వాతావరణంలో ఆరంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలో తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన తొలి కార్యక్రమం, అమలు చేసిన తొలి హామీ ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఏడాది జులై 1వ తేదీన స్వయంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నిరాటంకంగా సాగుతోంది. చంద్రబాబే స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మరీ వాళ్లకు తన చేతులతో పింఛన్ మొత్తాన్ని అందజేస్తోన్నారు. నేడు పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం పరిధిలోని యల్లమందలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు చంద్రబాబు. శారమ్మ అనే పింఛన్ లబ్ధిదారు ఇంటికి వెళ్లారు. పింఛన్ నగదును అందజేశారు. ఆమె కుటుంబ ఆర్థిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా కష్టపడుతున్న శారమ్మ కుమారుడికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల రుణాన్ని ప్రకటించారు చంద్రబాబు. శారమ్మ కుమార్తెకు నీట్‌లో కోచింగ్ ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. నీట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకోవాలని అభిలాషించారు. ఆ కుటుంబానికి అన్ని రకాలుగా తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మరో లబ్ధిదారు ఏడుకొండలు ఇంటికి వెళ్లారు చంద్రబాబు. దీపం పథకం గురించి ఆరా తీశారు. తానే స్వయంగా స్టవ్ వెలిగించి స్వయంగా కాఫీ పెట్టారు. కుటుంబ సభ్యులకు అందించారు. ఏడుకొండలు కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా యల్లమందలో పింఛన్ లబ్ధిదారు ఏడుకొండలు ఇంటికెళ్లిన సీఎం. దీపం పథకం గురించి ఆరా తీసి, ఏడుకొండలు ఇంట్లో స్వయంగా కాఫీ తయారు చేసి, కుటుంబ సభ్యులకు అందించిన చంద్రబాబు గారు. ఏడుకొండలు కుటుంబ పరిస్థితులు తెలుసుకుని, ఏడుకొండలును ఆర్థికంగా ఆదుకోవడంలో భాగంగా ఓ దుకాణాన్ని పెట్టుకోవడానికి అప్పటికప్పుడు చేయూతను ప్రకటించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అయిదు లక్షల రూపాయల రుణాన్ని ఇప్పించాలంటూ చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తి కావడానికి కూడా రుణాన్ని సైతం మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచి ముమ్మరంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. 63,77,943 మందికి పింఛన్ల పంపిణీ కోసం 2,717 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. కొత్త సంవత్సరం నేపథ్యంలో జనవరి 1కి ముందే పేదల ఇళ్లల్లో పింఛను మొత్తాన్ని ఉండాలని సంకల్పించింది. పల్నాడు జిల్లా యల్లమందలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు గారు. శారమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ నగదు అందజేసి, ఆమె కుటుంబం కష్టాలు అడిగి తెలుసుకున్న సీఎం. శారమ్మ కుమారుడికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష రుణం ఇప్పించాలని, శారమ్మ కుమార్తెకు నీట్ కోచింగ్. ఒకరోజు ముందుగానే అంటే 31వ తేదీనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 85 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. పెంచిన పింఛన్ మొత్తం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అంటే- ఏప్రిల్, మే, జూన్ నెలలకు గత ప్రభుత్వం శాంక్షన్ చేసిన 3,000 రూపాయలకు అదనంగా మరో వెయ్యి రూపాయలను కలిపింది.

# పేర్ని నానిపై కేసు




మచిలీపట్నం: రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదైంది. ఆయన్ను ఏ6గా చేరుస్తూ మచిలీపట్నం తాలూకా పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. పేర్ని నాని ఆదేశాల మేరకే లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదైన నేపథ్యంలో ఆయన పరారీలో ఉన్నారు. త్వరలోనే పోలీసులు అరెస్ట్ చేసే అవకాశముంది. మరోవైపు రేషన్ బియ్యం మాయం కేసులో ఇప్పటికే నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి మచిలీపట్నంలోని స్పెషల్ మొబైల్ జడ్జి 12 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించారు. ఈ కేసులో పేర్ని నాని సతీమణి జయసుధను ఏ1గా పోలీసులు పేర్కొన్నారు. ఆమెకు న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటికే అరెస్టయిన నలుగురు నిందితుల్లో గోదాము మేనేజర్ మానస్ తేజ, పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, రైస్ మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ బోట్ల మంగరాజు ఉన్నారు. వైకాపా హయాంలో జయసుధ పేరిట గోదామును పేర్ని నాని నిర్మించారు. దాన్ని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చారు. ఇటీవల ఆ గిడ్డంగిని అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో బియ్యం నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం మాయమైనట్లు తేల్చారు. గోదాము మేనేజర్ మానస్‌తేజ, పౌరసరఫరాల అధికారి కోటిరెడ్డి మిగిలిన ఇద్దరి బ్యాంకు ఖాతాల లావాదేవీల్లో సుమారు రూ.25 లక్షల నుంచి రూ.30లక్షల మేర లావాదేవీలు జరిగాయని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీటి ఆధారంగానే మిగిలిన నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. మరోవైపు పేర్ని నాని కుటుంబంలోని పలువురి ఖాతాలకు కూడా మానస్‌తేజ ఖాతా నుంచి డబ్బు (రూ.లక్షల్లో)లావాదేవీలు జరిగాయని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

# కొడాలి నాని ప్రధాన అనుచరుడు అరెస్ట్!




గుడివాడ: మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీని గుడివాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. వైకాపా హయాంలో గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీని కీలక సూత్రధారిగా పోలీసులు గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో 13 మంది వైకాపా కార్యకర్తలు అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా కాళీని అస్సాంలో గుడివాడ పోలీసు బృందాలు పట్టుకున్నాయి. వైకాపా హయాంలో గడ్డం గ్యాంగ్ ముసుగులో నిందితులు అరాచకాలకు పాల్పడ్డారు. వైకాపా అధికారంలో ఉండగా 2022 డిసెంబర్ 25న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తెదేపా కార్యాలయంపై పెట్రోల్ ప్యాకెట్‌లతో దాడులకు తెగబడ్డారు. ఈ విషయంపై నమోదైన కేసులో ఇప్పటికి వరకు 13 మంది కాళీ అనుచరులను ఇటీవల గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ప్రధాన నిందితుడు కాళీ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతడు ఈశాన్య రాష్ట్రమైన అస్సాం వెళ్లి అక్కడ చేపల వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే కాళీ కదలికలపై నిఘా ఏర్పాటు చేసి మంగళవారం అరెస్ట్ చేసినట్లు తెలిసింది. దీన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. త్వరలో నిందితుడిని గుడివాడ తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచే అవకాశముంది. మరోవైపు ఇదే కేసులో మాజీ మంత్రి కొడాలి నాని కూడా అరెస్ట్ అయ్యే అవకాశముంది. గతంలో అరెస్టయిన 13 మంది నిందితులను గుడివాడ వన్‌టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని రెండురోజుల పాటు విచారించారు. ఈ క్రమంలో వారు కొడాలి నాని ఆదేశాల ప్రకారమే దాడులకు పాల్పడ్డామని వెల్లడించినట్లు సమాచారం. వారి మాటల్లో వాస్తవాలు ఉన్నట్లుఉ రుజువైతే కొడాలి నానిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశముంది.

# పేర్నినానికి హైకోర్టులో స్వల్ప ఊరట




అమరావతి, డిసెంబర్ 31: మాజీ మంత్రి పేర్నినానికి ఏపీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో ఈరోజు (మంగళవారం) విచారణ జరిగింది. సోమవారం (జనవరి6) వరకు ఎటువంటి తొందర పాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది. రేషన్ బియ్యం మాఫీ కేసులో పేర్నినానిని పోలీసులు 6 వ నిందితుడిగా చేర్చారు. కాగా.. మచిలీపట్నం రేషన్ బియ్యం మాయం కేసులో పేర్నినానిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పేర్నినానిని ఏ6గా చేర్చుతూ కృష్ణా జిల్లా బందరు తాలుక పోలీస్ స్టేషన్‌లో కేసు ఫైల్ అయ్యింది. దీంతో ఏక్షణమైనా మాజీ మంత్రి అరెస్ట్ ఖాయం అనే వార్తలు వచ్చాయి. దీంతో పేర్నినాని పరారీలో ఉన్నట్లు తెలిసింది. అయితే అనూహ్యంగా పేర్నినాని హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఈరోజు ఉదయం హైకోర్టులో పేర్నినాని లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పేర్ని నాని తరపున న్యాయవాదలు ఈ పిటిషన్‌ను మూవ్ చేశారు. లంచ్ మోషన్ పిటిషన్‌ను అనుమంతించిన హైకోర్టు.. మధ్యాహ్నం 2:30 గంటలకు విచారణకు అంగీకరించింది. కాసేపటి క్రితమే పేర్నినాని పిటిషన్‌పై న్యాయస్థానంలో విచారణకు రాగా.. సోమవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# తూ.గో జిల్లాలో రేవ్ పార్టీ.. ప.గో జిల్లా వ్యక్తులే కీలకం!



ఏలూరు: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో రేవ్‌పార్టీ తరహాలో వేడుకలు కలకలం రేపాయి. పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌పై సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక, స్థానిక పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఆ సమయంలో పలువురు పురుషులు మద్యం తాగుతుండగా, మహిళలు నృత్యం చేస్తూ కనిపించారు. అందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు సత్తి బామిరెడ్డి, సత్తి రామిరెడ్డి, గుంటూరుకు చెందిన ఫెర్టిలైజర్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ రంగేటి గోపాలకృష్ణ సహా మొత్తం 19 మందిని అరెస్టు చేశారు. కాకినాడకు చెందిన ముగ్గురు, రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ప్రత్యేక హోమ్‌కు తరలించారు. ఈ రేవ్ పార్టీలో పశ్చిమ గోదావరి జిల్లా వ్యక్తులే కీలకంగా ఉన్నట్లు సమాచారం. గోపాలకృష్ణ అనే వ్యక్తి రూ.18 వేలకు ఫంక్షన్ హాల్ బుక్ చేసి పార్టీ నిర్వహించినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు, ఆచంట, గోపాలపురానికి చెందిన 10 మంది ఎరువుల డీలర్లను గోపాలకృష్ణ రప్పించాడు. కాకినాడకు చెందిన మహిళద్వారా వచ్చిన ఐదుగురు అమ్మాయిలుతో మద్యం తాగుతూ డ్యాన్స్‌లు చేశారు. ఈ కేసులో ఫంక్షన్ హాల్ యజమాని కుమారుడు సహా 10 మంది డీలర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## పింఛన్ల పంపిణీలో సచివాలయ మహిళా పోలీసు చేతివాటం



జమ్మలమడుగు: పింఛన్ల పంపిణీలో సచివాలయ మహిళా పోలీసు చేతివాటం చూపించారు. ఈ ఘటన వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో చోటు చేసుకుంది. వృద్ధాప్య పింఛనుకు రూ.300, వికలాంగ పింఛనుకు రూ.600 చొప్పున మహిళా పోలీసు వసూలు చేశారు. లంచం ఇవ్వకపోతే వచ్చే నెల నుంచి పింఛను తీసివేస్తారని హెచ్చరించారు. అడిగిన డబ్బు ఇవ్వలేక బాధితులు లబోదిబోమంటున్నారు.

# రేషన్ బియ్యం మాయం కేసులో నిందితులకు రిమాండ్



మచిలీపట్నం: రేషన్ బియ్యం మాయం కేసులో నిందితులకు మచిలీపట్నంలోని స్పెషల్ మొబైల్ జడ్జి 12 రోజుల రిమాండ్ విధించారు. మచిలీపట్నం సబ్‌జైలుకు నిందితులను తరలించారు.

ఈ కేసులో నిందితులుగా గోదాము మేనేజర్ మానస్ తేజ, పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, రైస్ మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ మంగరాజు ఉన్నారు.


వీరిని రాత్రి 11 గంటలకు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు ఇప్పటికే ముందస్తు బెయిల్ లభించిన విషయం తెలిసిందే.




# ఇకపై ఆ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం.. సర్కార్ కీలక నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 31: ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సర్కార్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యహ్న భోజన పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం అమలుకు పరిపాలనా అనుమతులు జారీ చేస్తూ ఏపీ సర్కార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 40ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జారీ చేశారు. దారిద్రరేఖకు దిగువున ఉన్న, పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. ఆర్థిక పరమైన ఇబ్బందులు కారణంగా ఉన్నత విద్యకు ఈ విద్యార్థులు దూరం కాకుండా చూడడంలో భాగంగా మధ్యహ్న భోజన పథకాన్ని సర్కార్ అమలులోకి తీసుకొచ్చింది. మధ్యహ్న భోజన పథకం ద్వారా విద్యార్థికి పౌష్టికాహారం అందడంతో పాటు ఆరోగ్యం, అన్ని విధాల అభివృద్ధి సాధ్యం అవుతుందని సర్కార్ భావించింది. ఈ పథకం ద్వారా పౌష్టికాహారం అందడం, హాజరు శాతం పెరగడంతో పాటు సామాజిక సమైఖ్యత పెరగడం ఏర్పడడం, పేద కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటు సాధ్యమవుతుంది. విద్యార్థి దశ నుంచే మంచి ఆహారపు అలవాట్లు కూడా అలవడే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా విద్యార్థి సంక్షేమంతో పాటు విద్యా, సామాజిక పరమైన లక్షాల సాధన జరుగుతుంది. రాష్ట్రంలోని 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జనవరి 1 నుంచి మధ్యహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని ఉత్తర్వుల్లో ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం కోసం రూ. 29. 39 కోట్లు బడ్జెట్ కేటాయించింది సర్కార్. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరో రూ. 85.84కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఈ పథకం అమలుకు ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్, మధ్యహ్న భోజన కార్యక్రమం డైరెక్టర్‌లు అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఉత్తర్వులతో పాటు మిడ్ డే మీల్ గైడ్ లైన్స్‌ను కూడా ఏపీ ప్రభుత్వం వెల్లడించింది.

# పీఎస్ఎల్వి-సి 60 విజయవంతంపై సీఎం చంద్రబాబు హర్షం..,



అమరావతి: శ్రీహరి కోట, ఇస్రో నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్వి-సి 60 మిషన్ మరో మైలురాయిని చేరుకోవడం పట్ల ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కక్ష్యలో స్పేస్ డాకింగ్ ప్రయోగం విజయవంతం అవడం ఆర్బిటాల్ డాకింగ్‌లో భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేస్తోందన్నారు. ఇది మానవ సహిత అంతరిక్ష యానానికి, ఉపగ్రహాల మెయింటినెన్స్‌కు ఈ ప్రయోగం ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ మిషన్ సక్సెస్ కావడంతో చంద్రయాన్ 4, చంద్రుని నమూనాలతో తిరిగి రావడం, భారతీయ అంతరిక్ష స్టేషన్ వంటి లక్ష్యాలకు మరింత చేరువ చేసిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాగా అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టి.. ఆపై వాటిని అనుసంధానం చేసే దిశగా చేపట్టిన ప్రయోగంలో తొలి ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ మిషన్‌లో భాగంగా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లిన ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ-సీ60.. వాటిని 476 కిలోమీటర్ల దూరంలోని వృత్తాకార భూ కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. ఆ కక్ష్యలో విడివిడిగా తిరుగుతున్న ఈ ఉపగ్రహాలను కొద్దిరోజుల తర్వాత సంక్లిష్ట విన్యాసంతో ఇస్రో శాస్త్రవేత్తలు అనుసంధానం (డాకింగ్) చేయనున్నారు. అది విజయవంతమైతే.. ఇప్పటికే డాకింగ్ సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ సగర్వంగా నిలుస్తుంది!

**జనవరిలో మరిన్ని..** వచ్చే ఏడాది జనవరిలో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. పీఎస్ఎల్వీ రాకెట్ నావిగేషన్ రెండో సిరీస్‌లో ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని పంపనున్నామని వెల్లడించారు. జనవరి మూడో వారంలో జీఎస్ఎల్వీ-ఎఫ్15 ప్రయోగం ఉంటుందన్నారు. ఇది కాకుండా.. గగన్‌యాన్-జీ1 ద్వారా మానవరహిత ప్రయోగం ఉంటుందని చెప్పారు. 2025లో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని తెలిపారు. పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. పూజలు చేశారు. అంతకుముందు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో ఇస్రో అధికారులు పీఎస్ఎల్వీ-సీ60 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కన్నప్ప.. రాకుమారి నెమలి లుక్ చూశారా?

టాలీవుడ్ ప్రముఖ సినీ కుటుంబాల్లో ఒకటైన మంచు ఫ్యామిలీ నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. హీరో మంచు విష్ణు లీడ్ రోల్ లో నటిస్తున్న ఆ సినిమాకు మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. కొంతకాలంగా మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ బ్యానర్స్ పై కలెక్షన్ కింగ్ మోహన్ బాబు రూ.100 కోట్లకు పైగా బడ్జెట్ తో కన్నప్ప చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాలో మహాదేవ శాస్త్రి పాత్రలో ఆయన నటిస్తున్నారు. మంచు విష్ణు పిల్లలు ఆరియానా, వివియానా, అవ్రామ్ కూడా యాక్ట్ చేస్తున్నారు. మంచు మూడో తరం కూడా సినీ ఇండస్ట్రీలోకి కన్నప్పతో వస్తుంది. అయితే ప్రభాస్, శరత్ కుమార్, మధుబాల, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ తదితరులు కన్నప్పలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 25న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రమోషన్స్ లో భాగంగా




శివుడికి ప్రీతికరమైన సోమవారం రోజు ప్రతి వీక్ కొత్త కొత్త అప్డేట్స్ ఇస్తున్నారు. ఇప్పటికే మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు ఫస్ట్ లుక్స్ ను విడుదల చేశారు మేకర్స్. తాజాగా మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న ప్రీతి ముకుందన్ లుక్ ను రివీల్ చేశారు. సినిమాలో ఆమె కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. పోస్టర్ లో ప్రీతి తన అందంతో అదరగొట్టేశారు. బ్యాక్ గ్రౌండ్ కూడా బాగుంది. అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం.. చెంచు యువరాణి నెమలి అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ ఆకట్టుకుంటోంది. విష్ణుకు జోడీగా స్క్రీన్ ను పంచుకుంటూ, దివ్య గాధకు మనోజ్ఞతను జోడించిందంటూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ప్రీతి పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే మహాకవి ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర మహత్యంలోని భక్త కన్నప్ప చరిత్రను స్ఫూర్తిగా తీసుకుని కన్నప్ప సినిమాను రూపొందిస్తున్నారు.

స్క్రిప్ట్ విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. సినీ ప్రియులను అలరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉండగా.. త్వరలో గుమ్మడికాయ కొట్టేయనున్నారు.

# అంజలి గేమ్ ఛేంజింగ్ రోల్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గేమ్ చేంజర్' జనవరి 10న థియేటర్స్ లోకి రాబోతోంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషనల్ యాక్టివిటీస్ నడుస్తున్నాయి. ఈ నెల ఆఖరున మూవీ ట్రైలర్ రిలీజ్ అవుతుందని టాక్ వినిపిస్తోంది. శంకర్ చాలా ప్రెస్టీజియస్ గా తీసుకొని ఈ సినిమా చేస్తున్నారు. కచ్చితంగా రామ్ చరణ్ కెరియర్ లోనే ఈ చిత్రం బెస్ట్ మూవీ అవుతుందని మేకర్స్ అంటున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ లో కనిపించబోతున్నాడు. తండ్రి కొడుకులుగా రెండు పాత్రలు అతను చేస్తోన్న సంగతి తెలిసిందే. యంగ్ రామ్ చరణ్ క్యారెక్టర్ కి జోడీగా కియారా అద్వానీ కనిపించబోతోంది. అలాగే తండ్రి పాత్రకి జోడీగా అంజలి నటించింది. ఈ సినిమాలో ఆమె పాత్రని ఇప్పటి వరకు శంకర్ రివీల్ చేయలేదు. సాంగ్స్ అన్ని కూడా ఆల్ మోస్ట్ కియారా అద్వానీతో కలిసి యంగ్ రామ్ చరణ్ కి ఉ



న్నవిగానే చూపించారు. అయితే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో అంజలి, రామ్ చరణ్ పై ఒక సాంగ్ ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అంజలి క్యారెక్టర్ చాలా స్పెషల్ గా ఉంటుందని ఇప్పటికే డైరెక్టర్ శంకర్ చెప్పారు. అందుకే ఆమె పాత్రని పూర్తిగా రివీల్ చేయకుండా సర్ప్రైజింగ్ గా ఉంచినట్లు వినిపిస్తోంది. సినిమాలో స్టోరీని మలుపు తిప్పే క్యారెక్టర్ లో అంజలి కనిపిస్తుందని అనుకుంటున్నారు. చాలా కాలం తర్వాత అంజలి తెలుగులో చేస్తోన్న పెద్ద సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలలో ఆమె పాత్రలో ఏదో ప్రత్యేకత ఉంటేనే తప్ప అంజలి మూవీస్ సాధారణంగా ఒప్పుకోదు. శంకర్ కూడా తన సినిమాలలో హీరోయిన్స్ పాత్రలని చాలా బలంగా చూపిస్తాడు ఏదో గ్లామర్ పరంగా వచ్చిపోయే తరహాలో హీరోయిన్స్ ని శంకర్ ఎప్పుడు చూపించరు. అలాగే 'గేమ్ చేంజర్' లో కూడా అంజలి పాత్రని చాలా బలంగా డిజైన్ చేశారనే టాక్ వినిపిస్తోంది. మూవీ కథలో అసలైన గేమ్ చేంజర్ గా ఆమె ఉండబోతోందని అనుకుంటున్నారు. అలాగే అంజలికి యూత్ లోనే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ లో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అందుకే గేమ్ ఛేంజర్ లో ఆమె పాత్రపై కూడా ఫ్యాన్స్ అంచనాలతో ఉంటారు. సినిమా ఏమాత్రం క్లిక్కయినా కూడా ఆమె కెరీర్ కు మరింత బూస్ట్ లభించినట్లే. ఇక గేమ్ ఛేంజర్ పాత్ర ఎంతవరకు క్లిక్కవుతుందో చూడాలి. ఇదిలా ఉంటే 'ఆర్ఆర్ఆర్' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ నుంచి వస్తోన్న పాన్ ఇండియా మూవీ కావడంతో ఈ సినిమాపై మెగా ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. దిల్ రాజు కూడా ఈ చిత్రంపై 200 కోట్లకి పైగా బడ్జెట్ పెట్టారు. ఈ నేపథ్యంలో 'గేమ్ చేంజర్' మూవీ ప్రతి ఒక్కరికి చాలా కీలకం అని చెప్పాలి.




# మృణాల్.. బాలీవుడ్ కు దూరంగా, టాలీవుడ్ కు దగ్గరగా..



హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. నార్త్ టు సౌత్ మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఆమె.. తాను చేయబోయే సినిమాల విషయంలో సెలెక్టివ్ గా ఉంటోంది. అన్ని విధాలుగా నచ్చితేనే ఓకే చెబుతున్న అమ్మడు.. అలా తక్కువ చిత్రాలతోనే ఎక్కువ ఫేమ్ దక్కించుకుందనే చెప్పాలి. మరాఠీ మూవీతో పదేళ్ల క్రితం సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన మృణాల్.. లవ్ సోనియా చిత్రంతో బీటౌన్ ఆడియన్స్ కు పరిచయమయ్యింది. ఆ తర్వాత బ్లాక్ బస్టర్ హిట్ సీతారామంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు.. ఎలా అలరించిందో స్పెషల్ గా చెప్పనక్కర్లేదేమో. తన అందం, అభినయంతో అందరినీ ఫిదా చేశారు. టాలీవుడ్ సీతగా మారిపోయి.. తెలుగు సినీ ప్రియుల హృదయాల్లో నిలిచిపోయింది. ఆ తర్వాత వివిధ హిందీ చిత్రాల్లో మెరిసిన బ్యూటీ.. నేచురల్ స్టార్ నాని సరసన హాయ్ నాన్నలో యాక్ట్ చేసి మెప్పించి మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది.

కానీ తెలుగులో హ్యాట్రిక్ మూవీ ఫ్యామిలీ స్టార్ తో హిట్ కొడుతారనుకున్నా అది జరగలేదు. చివరగా కల్కి 2898 ఏడీ మూవీలో క్యామియో రోల్ పోషించిన మృణాల్ ఠాకూర్.. ఇప్పుడు చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంది. బాలీవుడ్ లో పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హోనా హై, సన్ ఆఫ్ సర్దార్ 2, తమ్ హెూ తోహ్ చిత్రాల్లో నటిస్తున్నారు. తెలుగులో అడవి శేష్ డెకాయిట్ లో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రభాస్ స్పిరిట్ మూవీలో కూడా ఆమెను హీరోయిన్ గా సెలెక్ట్ చేసే అవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఆ సినిమా షూటింగ్ దాదాపు రెండేళ్లపాటు జరుగుతుందని సమాచారం. ఒకవేళ ఆ ఛాన్స్ దక్కితే ఆమె తెలుగులో మరింత క్రేజ్ ను సంపాదించుకోవడం పక్కా. అయితే ఇప్పుడు.. హైదరాబాద్ షిఫ్ట్ అయ్యే ప్లాన్ లో మృణాల్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే అనేక మంది భామలు.. తెలుగులో బిజీ అయ్యాక హైదరాబాద్ లో సొంత ఇల్లును కొనుగోలు చేసి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే.ల ఇప్పుడు మృణాల్ కూడా హైదరాబాద్ లో స్థిర నివాసం కోసం వెతుకుతున్నట్లు సమాచారం. మరి ఈ వార్తల్లో నిజమెంతో.. మృణాల్ హైదరాబాద్ కు షిఫ్ట్ అవుతారో లేదో వేచి చూడాలి. మృణాల్ హైదరాబాద్ లో ఉండడానికి ముఖ్య కారణం బాలీవుడ్ లో కంటే అమ్మడికి తెలుగులోనే మంచి క్రేజ్ దక్కుతోంది. పైగా హిందీలో ఆఫర్స్ వచ్చినా అవి చిన్న తరహాలో ఉంటున్నాయి. ఇక తెలుగులో హీరోయిన్స్ కొరత ఎప్పటికి ఉంటుంది. పైగా పాన్ ఇండియా రేంజ్ లో సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి. అయితే ఇటు తెలుగులో అటు హిందీలో తెలిసిన హీరోయిన్స్ దొరకడం కష్టమే అవుతుంది.

ఇక ఆ క్యాటగిరీ సినిమాలకు మృణాల్ పర్ఫెక్ట్ ఛాయిస్. అందుకే అమ్మడు హైదరాబాద్ లో ఉంటే నిర్మాతలకు కూడా అందుబాటులో ఉండవచ్చు. ప్రతీసారి ట్రావెలింగ్ ఖర్చుల భారం తగ్గుతుంది. ఏదేమైనా మృణాల్ ఇప్పుడు టాలీవుడ్ లో రష్మిక తరువాత బెస్ట్ హీరోయిన్ గా అందుబాటులో ఉండాలని చూస్తోంది.


# 'లైలా' సోనూ మోడల్ సాంగ్.. విశ్వక్ సేన్ చితక్కొట్టేశాడు..




టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్.. ఫుల్ స్పీడ్ లో ఉన్న విషయం తెలిసిందే. వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఆయన.. మరిన్ని చిత్రాలు లైన్ లో పెడుతున్నారు. కొత్త తరహా కథల్లో నటిస్తూ యూత్ కు బాగా దగ్గరైన విశ్వక్ సేన్.. ఇప్పుడు లైలా మూవీ షూటింగ్ ను పూర్తి చేసే పనిలో ఉన్నారు. అమ్మాయి, అబ్బాయిగా రెండు రోల్స్ లో విశ్వక్ నటిస్తున్న లైలా మూవీని రామ్ నారాయణ్ తెరకెక్కిస్తున్నారు. షైన్ స్క్రీన్ పిక్చర్స్, ఎస్ ఎమ్ టీ అర్చన ప్రెజెంట్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత సాహు గారపాటి రూపొందిస్తున్నారు. ఆకాంక్ష హీరోయిన్ గా నటిస్తున్నారు. లైలా మూవీతోనే ఆమె.. టాలీవుడ్ లోకి అడుగు పెడుతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతుండగా.. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు. కొద్ది రోజుల క్రితం సినిమా ప్రమోషన్స్ ను స్టార్ట్ చేసిన మేకర్స్ వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. సినిమాపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నారు. అయితే ఇప్పటికే అనౌన్స్ చేసినట్లు ఆదివారం ఉదయం లైలా ఫస్ట్ సింగిల్ సోనూ మోడల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. సోనూ మోడల్ వైబ్ ఆంథమ్ పేరుతో ఫుల్ వీడియో సాంగ్ ను విడుదల చేశారు. సాధారణంగా మేకర్స్.. సినిమా రిలీజ్ తర్వాత ఫుల్ వీడియో సాంగ్స్ ను విడుదల చేస్తుంటారు. కానీ లైలా మేకర్స్ ముందే రివీల్ చేసేశారు. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన సోనూ మోడల్ సాంగ్ ను నారాయణ్ రవిశంకర్, రేష్మా శ్యామ్ ఆలపించారు. విశ్వక్ సేన్ లిరిక్స్ అందించి మరోసారి తన టాలెంట్ చూపించారు. లిరిక్స్ చాలా క్రేజీగా ఉన్నాయనే చెప్పాలి. మ్యూజిక్ కూడా ట్రెండీగా ఉంది. మ్యూజిక్ లవర్స్ ప్లే లిస్ట్ లోకి చేరిపోయింది. ప్రస్తుతం యూట్యూబ్ లో దూసుకుపోతోంది. అదే సమయంలో విశ్వక్ సేన్ డ్యాన్స్ తో అదరగొట్టేశారు. వేరే లెవెల్ స్టెప్పులతో ఆకట్టుకున్నారు. ఆయన వేసుకున్న అవుట్ ఫిట్స్.. అన్నీ ట్రెండీగా, క్రేజీగా ఉన్నాయి. ఆకాంక్ష శర్మ.. తన గ్లామరస్ లుక్స్ తో అట్రాక్ట్ చేశారు. సాంగ్స్ విజువల్స్ రిచ్ గా బాగున్నాయి. ఓవరాల్ గా లైలా ఫస్ట్ సింగిల్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుని సందడి చేస్తోంది. మరి మీరు ఆ పాట విన్నారా? వీడియో సాంగ్ చూశారా?

# జాన్వీ.. ఇదేం ఎక్స్‌ప్రెషనో..


హీరోయిన్ జాన్వీ కపూర్.. క్రిస్మస్ ఫెస్టివల్ ను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్న విషయం తెలిసిందే. రెడ్ వైన్ కలర్ బాడీ కాన్ డ్రెస్సులో అదరగొట్టేసిన ముద్దుగుమ్మ.. ఇప్పటికే తన సెలబ్స్ కు సంబంధించిన కొన్ని పిక్స్ ను షేర్ చేసింది. అందులో కిర్రాక్ గా ఉన్న అమ్మడు.. అందరినీ ఫిదా చేసిందనే చెప్పాలి. తన బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహారియా, చెల్లి ఖుషీ కపూర్, అన్న అర్జున్ కపూర్, ఫ్రెండ్ రాధికా అంబానీ మర్చంట్ సహా పలువురితో జాన్వీ క్రిస్మస్ ను జరుపుకున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. అందరితో దిగిన పిక్స్ ను ఇప్పటికే పోస్ట్ చేయగా.. జాన్వీ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. సోలోగా దిగిన ఫోటోస్ చూసిన నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అయ్యారు. సింపుల్ నెక్ సెట్ వేసుకున్న అమ్మడు.. క్లీవేజ్ షో చేసి మైండ్ బ్లాక్ చేసేసింది. తాజాగా మరిన్ని పిక్స్ బయటకొచ్చాయి. అందులో జాన్వీ సరికొత్త ఎక్స్ప్రెషన్ ఇవ్వగా.. ఆ ఫోటో వైరల్ గా మారింది. ఓవైపు హీట్



పుట్టించేలా.. మరోవైపు క్రేజీగా అమ్మడు ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. పిక్ సూపర్ గా ఉందని సందడి చేస్తున్నారు. అదే సమయంలో సెలబ్రిటీల మీద చేయి వేసి, ఫోటోలకు ఫోజులు ఇచ్చి మంచి పాపులర్ అయిన ఓర్రీ కూడా ఆ పిక్స్ లో ఉన్నాడు. జాన్వీ కపూర్ తో కలిసి ఓర్రీ చేసిన సందడి మామూలుగా లేదు. వేరే లెవెల్ లో పిక్స్ దిగి చిల్ అయినట్లు కనిపిస్తున్నారు. జాన్వీ, ఓర్రీ సహా గ్యాంగ్ అంతా పబ్ లో ఎంజాయ్ చేసినట్లు అర్థమవుతోంది. ఇక జాన్వీ సినిమాల విషయానికొస్తే.. రీసెంట్ గా దేవర మూవీతో టాలీవుడ్ మూవీ లవర్స్ కు హాయ్ చెప్పేసింది. ఫస్ట్ పార్ట్ లో ఆమె రోల్ కు స్కోప్ తక్కువే ఉన్నా.. తన యాక్టింగ్ తో ఆకట్టుకుంటుందనే చెప్పాలి. ఇప్పుడు తెలుగులో రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమాలో యాక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ స్టార్ట్ అయిపోయింది. అదే సమయంలో జాన్వీ యాక్ట్ చేస్తున్న పరమ సుందరి గ్లింప్స్ ఇటీవల రిలీజ్ అవ్వగా.. అందులో కూడా చీరకట్టుతో సందడి చేసింది జాన్వీ కపూర్. వచ్చే ఏడాది ఆ సినిమా విడుదల కానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఆ మూవీతో పాటు మరో హిందీ సినిమాలో కూడా భాగమైన జాన్వీ.. ఫ్యూచర్ లో ఎలాంటి హిట్స్ అందుకుంటుందో వేచి చూడాలి.

# అతి పెద్ద రామ్ చరణ్ కటౌట్ ఇదుగో..!

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించిన 'గేమ ఛేంజర్' సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. వచ్చే నెలలో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న గేమ్ ఛేంజర్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు గేమ్ ఛేంజర్ సినిమాను రూపొందించారు. సినిమాను భారీ ఎత్తున ప్రమోట్ చేయడం కోసం దిల్ రాజు అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెల్సిందే. సినిమాపై ఉన్న అంచనాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చరణ్ కటౌట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడలో రికార్డ్ స్థాయి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడలోని బృందావన కాలనీ వజ్రా మైదానంలో ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు




చేశారు. ఇప్పటి వరకు ఏ ఇండియన్ హీరో పెట్టని 256 అడుగుల భారీ కటౌట్‌ను చరణ్ ఫ్యాన్స్ ఏర్పాటు చేశారు. యువశక్తి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్ ను ఏర్పాటు చేశారు. రామ్ చరణ్ పై తమకు ఉన్న అభిమానంను వారు ఇలా చూపించారు. సోషల్ మీడియాలో వారు ఏర్పాటు చేసిన అతి భారీ కటౌట్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్ ఆవిష్కరణ జరిగింది. దాదాపు వారం రోజుల పాటు కష్టపడి ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినట్లుగా ఫ్యాన్స్ చెబుతున్నారు. చెన్నై నుంచి వచ్చిన ప్రత్యేక టీం ఈ భారీ కటౌట్ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. అత్యంత ఖరీదుతో ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినట్లుగా ఫ్యాన్స్ చెప్పుకొచ్చారు. గేమ్ ఛేంజర్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే నమ్మకంను వారు వ్యక్తం చేశారు. లుంగీ కట్టుకుని, బనియన్ పై ఉన్న రామ్ చరణ్ మాస్ లుక్‌కి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. విజయవాడ రామ్ చరణ్ ఫ్యాన్స్ పై మెగా ఫ్యాన్స్ అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. రామ్ చరణ్ ఈ అరుదైన ఘనతకు పూర్తిగా అర్హుడు అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు ఆయన నుంచి మరిన్ని ఇలాంటి మంచి సినిమాలు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.




హైదరాబాద్: తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు.




## తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా .. ఈనెల 30 వరకు అరెస్టు చేయొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణ 31కి వాయిదా పడింది. తాజాగా ఇరు వైపులా వాదనలు ముగియగా.. కేటీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చే వరకు అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది.

**ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారు: ఏజీ సుదర్శన్‌రెడ్డి...** ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు.

దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## రైతు భరోసాపై కీలక అప్‌డేట్.. మంత్రి తుమ్మల ఏమన్నారంటే..



ఖమ్మం: రైతు భరోసా మీద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి శివారు వ్యవసాయ క్షేత్రంలో ఇవాళ(మంగళవారం) మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. 21 వేల కోట్ల రుణామాఫీ, రూ.7,625 వేల కోట్ల రైతు బంధు, రూ. 3 వేల కోట్ల రైతు భీమా ఇచ్చిందని ప్రకటించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చామని స్పష్టం చేశారు. పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలనేదే స్థూలంగా తమ ప్రభుత్వం ఆలోచన అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మీద ఎలాంటి నిబంధనలు కానీ పంట వేయనటువంటి రైతులను తగ్గించటం కోసం చేసే ప్రయత్నం కానీ తమ ప్రభుత్వం ఇంత వరకు ఏ విధమైన ఆలోచన చేయలేదని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీ కేవలం విధి విధానాల మీద చర్చించడం మాత్రమే చేశామన్నారు. ఈ రోజు ఈ నిమిషం వరకు రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం చేయనటువంటి ప్రభుత్వంపై ప్రసార సాధనాల ద్వారా కానీ ప్రతి పక్షాలు దుష్ప్రచార చేసే ఆలోచన చేయొద్దని తెలిపారు.

రైతు భరోసాపై తాము చేసిన చర్చల ఫలితాలను కేబినెట్‌లో పెడతామని అన్నారు. రైతు భరోసాపై కేబినెట్ నిర్ణయమే తుది నిర్ణయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ రెండు రోజులు ఎంజాయ్ చేయనివ్వండి అని అన్నారు. కొత్త సంవత్సరం రోజు కేటీఆర్‌ను బాధ పెట్టకండి అని చెప్పారు. న్యూ ఇయర్ రోజు ఎంజాయ్ చేయనీయాలని అన్నారు. కేటీఆర్ గు రించి 3, 4 వ తేదీల్లో చూద్దామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. జలసౌధలో ఇవాళ నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ పార్లమెంటు పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నల్గొండ ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని హెచ్చరించారు.

కాంట్రాక్టర్ పని చేయకపోతే సంబంధిత మంత్రికి చెప్పాలన్నారు. దయచేసి అధి కారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయొద్దని వార్నింగ్ ఇచ్చారు. అధికారులు సీరియస్‌గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చని చెప్పారు. SLBC ప్రాజెక్ట్ 4 లక్షల ఎకరాలకు నీళ్లిచే ప్రాజెక్ట్ అని వివరించారు.

## కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్: కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తిగా నిర్మాణం చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి...నామమాత్రం ఆయకట్టు మాత్రమే చేశారని చెప్పారు. పాలమూరు రూ.27వేలు, సీతారామ ప్రాజెక్టు రూ.8వేలు ఖర్చు చేసి ఒక్క ఎకరా ఆయకట్టు కూడా ఇవ్వలేదన్నారు. 800 టీఎంసీల తెలంగాణకు 299 టీఎంసీ, ఆంధ్రాకు 519 టీఎంసీ గతంలో ఒప్పుకున్నారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 500 టీఎంసీ నీళ్ల కోసం సర్కార్ ఫైట్ చేస్తోందని చెప్పారు. సమక్క సారలమ్మ 44 టీఎంసీలు త్వరలోనే క్లియర్ కాబోతున్నాయన్నారు.. రాబోయే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో కొత్త ఆయకట్టు తేవాలని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 18వందల లష్కర్‌లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించబోతున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు వచ్చే పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అధికారులు బాధ్యతగా ఉండకపోతే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ ఏఈని సస్పెండ్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.




దిల్లీ: పండగలైనా, వివాహాది శుభకార్యాలైనా ముందు గుర్తొచ్చేది బంగారం. అనిశ్చిత పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగానూ ఇది ఉపయోగపడుతుంది. వివిధ కారణాల వల్ల ఈ ఈ ఏడాది బంగారం ధర దూసుకెళ్లింది. వచ్చే ఏడాదీ ఇది ఒరవడి కొనసాగొచ్చని భావిస్తున్నారు మార్కెట్ విశ్లేషకులు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, ఆర్థిక అస్థిరత పరిస్థితుల కొనసాగితే దేశీయంగా 10 గ్రాముల పసిడి ధర రూ.85వేలకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. రూ.90వేలకు చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతున్నారు. దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం 10 గ్రాముల పసిడి ధర రూ.79,350 వద్ద కొనసాగుతోంది.

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో రూ.76,600 వద్ద ట్రేడవుతోంది. 2024లో బంగారంలో పెట్టుబడి పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలం లభించింది. ఈ క్యాలెండర్ సంవత్సరంలో 23 శాతం రాబడి అందించింది. దేశీయంగా అక్టోబర్ 30న ఏకంగా రూ.82,400 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని చేరింది. వెండి సైతం 30 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ ఏడాది తొలిసారి కిలో వెండి ధర రూ.1 లక్ష మార్కు దాటింది. అంతర్జాతీయ విపణిలో ఈ ఏడాది ప్రారంభంలో ఔన్సు (31 గ్రాములు) బంగారం 2062 డాలర్లుగా ఉండగా.. ఓ దశలో 2790 డాలర్ల స్థాయికి చేరింది. ప్రస్తుతం 2600 డాలర్ల ఎగువన ట్రేడవుతోంది. 2025లోనూ పసిడి మెరుగైన రాబడి అందించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారం కొనుగోలు చేస్తుండడం, వడ్డీ రేట్లు తగ్గింపు వంటివి ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు.

## దల్లేవాల్‌కు వైద్య సహాయం.. పంజాబ్ ప్రభుత్వానికి మరింత సమయమిచ్చిన సుప్రీం

దిల్లీ: రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ 36 రోజులుగా నిరవధిక నిరశన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో తగిన వైద్య సహాయం అందజేయాలని డిసెంబరు 20న సుప్రీంకోర్టు పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దల్లేవాల్‌కు వైద్యసహాయం అందించడానికి తమకు మరింత గడువు కావాలని ప్రభుత్వం కోరడంతో.. అందుకు అంగీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణను జనవరి 2కు వాయిదా వేసింది. దల్లేవాల్‌కు వైద్యసహాయం అందించడానికి ప్రభుత్వానికి మరికొంత సమయం ఇచ్చింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. దీంతో రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని సుప్రీం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని, కనీసం ఐవీ ఫ్లూయిడ్స్‌నైనా ఇచ్చేందుకు వీలుచిక్కడం లేదని పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయత వ్యక్తంచేసింది. బలవంతంగా తరలిస్తే ఇరువైపులా ప్రాణనష్టం తప్పకపోవచ్చని వివరించింది. దీనికోసం మరింత సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరింది. ప్రభుత్వం విన్నపం మేరకు కోర్టు మరో మూడు రోజుల సమయం ఇచ్చిందని పంజాబ్ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న రైతులతో అధికారులు చర్చలు జరుపుతున్నారని.. దల్లేవాల్‌ను సమీపంలోని తాత్కాలిక ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. డిసెంబర్ 28న జరిపిన విచారణలో దల్లేవాల్‌ను ఆసుపత్రికి తరలించనందుకు పంజాబ్ సర్కారుపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. డెబ్బై ఏళ్లకు పైబడిన నేతకు వైద్యచికిత్స అందడానికి అడ్డుపడుతున్న రైతు నేతల ఉద్దేశం పైనా అనుమానాలు వ్యక్తంచేసింది. నిజంగా ఆయన క్షేమాన్ని కోరుకునేవారైతే, అలా వైద్య సాయాన్ని అడ్డుకోరని పేర్కొంది. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించింది.

## మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై దుమ్మెత్తిపోసిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 31: రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దూషణలు కొనసాగుతూనే ఉన్నాయి. గురుకుల పాఠశాలలో సరైన భోజనం లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారంటూ మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో అన్నపూర్ణగా నిలిచిన తెలంగాణలో నేడు ఆకలికేకలు వినిపిస్తున్నాయని విమర్శించారు. గురుకులాల్లో చదువుకుని ఎంతో ఎత్తుకు ఎదిగిన విద్యార్థులు.. నేడు ఆకలి బాధతతో అల్లాడిపోతున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. "అన్నపూర్ణ నా తెలంగాణలో బువ్వకోసం బిడ్డల ఏడ్పులా ! కోటీ 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన నా తెలంగాణలో పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనాదాలా ! దశాబ్దాల కాంగ్రెస్ పాలన మూలంగా ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అంబలికేంద్రాలకు నిలయమైన తెలంగాణను పదేళ్ల కేసీఆర్ గారి పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలిపాం. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నమో రామచంద్రా అని ఆకలికేకలా ! పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకులాల్లో చదువుకుని ఎవరెస్ట్ శిఖరాలు అధిరోహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులు .. నేడు గుప్పెడన్నం కోసం గుండెలవిసేలా రోదించడమా ! సిగ్గు సిగ్గు.. ఇది పాలకుల పాపం. విద్యార్థులకు శాపం. జాగో తెలంగాణ జాగో" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. మరోవైపు మాజీ మంత్రి హరీష్‌రావు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పేదరిక నిర్మూలన సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఆరు నెలలుగా జీతాలు రాక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీతాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని.. అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మిన్నకుండా ఉండటంపై మాజీ మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హరీష్‌రావు ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకే జీతాలు చెల్లించకుండా వారిని పేదరికంలోకి నెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తాం అంటూ డబ్బా కొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులకు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం శోచనీయమన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న 6000 మంది ఆర్పీలకు ఆరు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకే జీతాలు చెల్లించకుండా వారిని పేదరికంలోకి నెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. జీతాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం సిగ్గుచేటన్నారు. కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా అయినా ఆర్పీల పెండింగ్ జీతాలను చెల్లించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు.




హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన తెలుగు చిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. "సీఎంతో జరిగిన సమావేశం ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదు.. అందరికీ తెలిసే జరిగింది. తెలుగు చిత్రపరిశ్రమ బాగోగుల గురించి అత్యంత స్నేహపూర్వకంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశం పట్ల చిత్రపరిశ్రమ చాలా సంతృప్తిగా ఉంది. తెలంగాణ అభివృద్ధి పయనంలో చిత్రపరిశ్రమ భాగస్వామ్యాన్ని గుర్తించి.. రాష్ట్రాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి, మా బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన సంకల్పాన్ని చిత్రపరిశ్రమ ప్రతినిధులుగా మేమందరం స్వాగతించాం. అనవసర వివాదాల్లోకి చిత్ర పరిశ్రమను లాగి, పరిశ్రమకు లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని మా మనవి. రాజకీయ దాడి, ప్రతిదాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దని అందరినీ కోరుతున్నాం. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోన్న చిత్ర పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని ఆశిస్తున్నాం" అని దిల్ రాజు పేర్కొన్నారు.

**కేటీఆర్ ఏమన్నారంటే?..** సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ... సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంపై మరోసారి స్పందించారు. కేవలం ప్రచారం కోసం, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సినిమా వాళ్ల గురించి సీఎం రేవంత్ రెడ్డి అలా మాట్లాడారని పేర్కొన్నారు. అటెన్షన్, డైవర్షన్ కోసమే సీఎం పాకులాడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. సినిమా వాళ్లతో సెటిల్ చేసుకొని ఇప్పుడు ఏం మాట్లాడట్లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలపై దిల్ రాజు స్పందించారు.

## భగీరథమ్మ చెరువులో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్ : నానక్‌రామ్ గూడ భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలను హైడ్రా అధికారులు చేపట్టారు. బఫర్ జోన్‌లోని రెండు ఎకరాల స్థలంలో ఇటీవల ఆక్రమణదారులు రేకుల షెడ్లు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో హైడ్రా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో చేరుకుని జేసీబీలతో నిర్మాణాలను నేలమట్టం చేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com